చిక్కడపల్లి పీఎస్ పరిధిలో

నేటి నుంచి 15 రోజులపాటు ట్రాఫిక్ మళ్లింపు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం నుంచి ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వీరేశం తెలిపారు. వీఎస్టీ సిగ్నల్ వద్ద వరదనీరు నిలిచిపోకుండా నిర్వహించనున్న కచ్చా నాలా మోరీ పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా పదిహేనురోజులపాటు ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాంనగర్, అడిక్‌మెట్ నుంచి వచ్చే వాహనదారులు బయలాజికల్ ఈవాన్స్ వద్ద లెఫ్ట్ తీసుకొని హిందీ మహావిద్యాలయ సిగ్నల్ నుంచి రైట్ తీసుకుని స్టీల్ బ్రిడ్జిపైకి వెళ్లాలని, ఆర్టీసీక్రాస్‌రోడ్, చిక్కడపల్లికి వెళ్లే వారు కూడా హిందీమహావిద్యాలయ సిగ్నల్ నుంచి రైట్ తీసుకుని వెళ్లాలని సూచించారు. ఆర్టీసీక్రాస్‌రోడ్ నుంచి హిందీ మహావిద్యాలయ, రాంనగర్, అడిక్‌మెట్ వెళ్లే వాహనదారులు వీఎస్టీవద్ద లెఫ్ట్ తీసుకుని ఆర్టీసీ ముషీరాబాద్ డిపో మీదుగా ముందుకు వెళ్లి బయలాజికల్ ఈవాన్స్ నుంచి వెళ్లాలని తెలిపారు.


రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ జి. శంకర్‌రాజు

ర్యాష్ డ్రైవింగ్ ప్రమాదకరం : ఏసీపీ

బర్కత్‌పుర, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): బైక్ విన్యాసాలతో యువత ప్రాణాలు పోగొట్టుకుంటుందని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. ర్యాష్ డ్రైవింగ్ ప్రమాదకరమని అన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేటర్ పరిధిలోని ఐటీ కారిడార్, హుస్సేన్‌సాగర్ నాలా పరిసర ప్రాంతాలు, ఔటర్ రింగ్ రోడ్డుపై యువకులు బైక్ విన్యాసాలు చేస్తున్నారని, విన్యాసాలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సావిత్రి, ఓఎస్‌డీ కపిల్, హెచ్‌వోడీ దీప, వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


డీఎంసీ మారుతీదివాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

కాచిగూడలో సీసీ రోడ్ల పనులను ప్రారంభించాలి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో సీసీ రోడ్ల పనులను వెంటనే ప్రారంభించాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి విజ్ఞప్తి చేశారు. బుధవారం అంబర్‌పేట సర్కిల్-16 డీఎంసీ మారుతీదివాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. లింగంపల్లి, బాలప్పబాడ, కాచిగూడ పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాలలో సీసీ రోడ్లు మంజూరైనా ఇప్పటి వరకు పనులను ప్రారంభించలేదన్నారు. రోడ్ల మరమ్మతుల పనులను కూడా పూర్తి చేయాలన్నారు. నారాయణగూడ మోడల్ మార్కెట్‌ను ప్రారంభించాలని, ఫీవర్ ఆస్పత్రి బ్రిడ్జి నుంచి బాగ్‌లింగంపల్లి బ్రిడ్జి వరకు హుస్సేన్‌సాగర్ నాలాలో రిటైనింగ్ వాల్ పనులను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న డిప్యూటీ డీఈవో ఎం. విజయలక్ష్మి

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని హిమాయత్‌నగర్ ఎడ్యుకేషన్ జోన్ డిప్యూటీ డీఈవో ఎం. విజయలక్ష్మి సూచించారు. బుధవారం కాచిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ హెచ్‌డీఎస్‌జీఎఫ్ ఇంటర్ హిమాయనగర్ జోనల్ లెవెల్ స్కూల్ కబడ్డీ, కోకో పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలు క్రీడల్లో రాణించేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఈ పోటీల్లో వంద జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్స్ ఆఫ్ స్కూల్స్ ఆర్. సుమన్ నాయక్, నిజాముద్దీన్, డాక్టర్ ఎ. చిరంజీవి పాల్గొన్నారు.

'చైల్డ్ ఫోర్న్‌పై 'సుప్రీం' నిర్ణయం చారిత్రాత్మకమైనది'

కవాడిగూడ, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): చైల్డ్ ఫోర్న్‌పై దేశ సర్వోన్నత న్యాయస్థానం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైందని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం కవాడిగూడలోని న్యాయవాదుల జేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చైల్డ్ ఫోర్న్ సమస్య ప్రపంచ వ్యాప్తంగా తల్లిదండ్రులను మానసికంగా వేధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజిరెడ్డి, సూర్య ప్రకాష్, చంద్రశేఖర్‌రెడ్డి, నాగేశ్వర్, రమేష్, నోముల కృష్ణగౌడ్, కె. కొండల్ రెడ్డి, జి. సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నిదానాల్లోకెల్లా అన్నదానం గొప్పది

చిక్కడపల్లి, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): అన్నిదానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని చిక్కడపల్లి ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు చేపూరి లక్ష్మణ్‌గుప్తా అన్నారు. బుధవారం మధ్యాహ్నం కార్మిక కమిషనర్ కార్యాలయం వద్ద గుడిశెట్టి శంకరయ్య సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు సింగారపు రమేష్‌గుప్తా, నరసింహారావు, పల్లెర్ల రమేశ్, కేవీపీ ప్రసాద్, వెంకటసుబ్బయ్య, బాలచందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

10 జీపీఏ సాధించిన విద్యార్థినికి రూ. 10 వేల చెక్కు

రాంనగర్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): గడచిన విద్యా సంవత్సరం 2023-24లో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బాగ్‌లింగంపల్లిలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌లో 10 జీపీఏ సాధించిన ఫాతిమాకు నాయిని నర్సింహారెడ్డి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి రూ. 10వేల చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ వాణిశ్రీ, విద్యార్థినీ తండ్రి షరీఫ్ హుస్సేన్ తదితరులు పాలల్గొన్నారు.


విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న వి. శ్రీనివాస్‌రెడ్డి

బీజేపీకి పటిష్ఠ పునాదులు వేసిన వ్యక్తి దీన్‌దయాళ్

చిక్కడపల్లి, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి పటిష్ఠ పునాదులు వేసిన మహోన్నతవ్యక్తి పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ అని ఎంపీ డా. కె. లక్ష్మణ్ అన్నారు. దీనదయాళ్ ఉపాధ్యాయ 108వ జయంతిని గాంధీనగర్ డివిజన్ 274 పోలింగ్‌స్టేషన్ పరిధిలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న లక్ష్మణ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏకాత్మ మానవతావాదాన్ని ప్రవచించి అంత్యోదయ విధానాన్ని రూపొందించిన గొప్ప వ్యక్తి దీనదయాళ్ ఉపాధ్యాయ అని అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు మహిళలు, యువతకు పార్టీ సభ్యత్వాన్ని అందజేశారు. బీజేపీ నాయకులు జయశ్రీ, పూసరాజు, రమేష్‌రామ్, శ్రీకాంత్, శివకుమార్, సురేష్, అరుణ్‌కుమార్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.


దీన్‌దయాళ్‌కు నివాళులర్పిస్తున్న డా. లక్ష్మణ్, రత్నసాయిచంద్ తదితరులు

దేశ రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానం

బర్కత్‌పుర: దేశ రాజకీయ చరిత్రలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ప్రత్యేక స్థానం ఉందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ గౌతమ్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సి. కృష్ణయాదవ్, మాజీ ఎమ్మెల్యే ప్రేంసింగ్‌రాథోడ్, బీజేపీ నేతలు ఎ. సూర్యప్రకాష్ సింగ్, సందీప్‌సాయి, అనంతలక్ష్మి, ప్రవీణ్‌కుమార్, కేశబోయిన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశయసాధనకు పోరాటం చేయాలి

అంబర్‌పేట: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయ సాధన కోసం పోరాటం చేయాలని అంబర్‌పేట బీజేపీ నేతలు పిలుపునిచ్చారు. దీన్‌దయాళ్ జయంతిని బుధవారం బీజేపీ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు దాసోజు నాగభూషణంచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ.. ఏకాత్మక ఉద్యమానికి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ కృషి చేశారని అన్నారు.

కార్యక్రమంలో బీజేపీ నేతలు యశ్వంత్, ఎం. రాజు, భిక్షపతి, కృష్ణముదిరాజ్, దయాకర్‌యాదవ్, రాంచందర్‌గుప్తా, పెంటం రాజు, ఎస్.ఎస్.రెడ్డి, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ జీవిత చరిత్రను యువత ఆదర్శంగా తీసుకోవాలి

కవాడిగూడ: దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీవిత చరిత్రను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎం. రమేష్‌రాం, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎంసీ మహేందర్‌బాబు సూచించారు. బుధవారం ఇందిరాపార్కు చౌరస్తాలో దీన్‌దయాళ్ చిత్రపటం ఏర్పాటు చేసి నివాళులర్పించారు.

నాయకులు జి. వెంకటేష్, పరిమళ్‌కుమార్, వడ్డేటి దేవేందర్, ఎ. ప్రభాకర్ గంగపుత్ర, యువమోర్చా అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు చిత్రకుమార్ గౌడ్, బొల్ల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అంత్యోదయ మార్గదర్శకుడు

రాంనగర్: అంత్యోదయ మార్గదర్శకుడు దీన్‌దయాళ్ అని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రేయ్యూరు శేషసాయి అన్నారు. బుధవారం అడిక్‌మెట్ డివిజన్ లలితానగర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు ఆర్. నరేష్, మాజీ అధ్యక్షుడు పి.సాయికృష్ణయాదవ్, నేతలు కౌండిన్య ప్రసాద్, గౌరీశంకర్, సుబ్రహ్మణ్యంబాబు, ఎం.సి.మోహన్, వంశీ కృష్ణ, ఓంప్రకాష్, ప్రదీప్, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.


బర్కత్‌పురలో బీజేపీ కార్యాలయంలో, అంబర్‌పేట పటేల్‌నగర్ చౌరస్తాలో, ఇందిరాపార్కు చౌరస్తాలో, లలితానగర్‌లో దీన్‌దయాళ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆగమ విద్యార్థుల మార్గ నిర్దేశకుడు రమాకాంతాచార్యులు

కొత్తపేట, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ఎందరో ఆగమ విద్యార్థులకు మార్గనిర్దేశం చేసిన ఘనత సముద్రాల రమాకాంతాచార్యులకే దక్కుతుందని త్రిదండి చిన జీయర్ స్వామి కొనియాడారు. ఆగమశాస్త్ర పండితుడు మద్వాధుల సముద్రాల రమాకాంతాచార్యులు(80) ఈనెల 13న నాగోల్‌లో తుదిశ్వాస విడిచారు. స్నేహపురి కాలనీలోని గోదా సమేత పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రీనివాస మండపంలో బుధవారం సముద్రాల రమాకాంతాచార్యుల పరమపదోత్సవం చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో సముద్రాల శ్రీమన్నారాయణాచార్యుల అధ్వర్యంలో వేదపండితుల సమక్షంలో నిర్వహించారు.



మాట్లాడుతున్న చినజీయర్ స్వామి

ఈ సందర్భంగా చిన జీయర్‌స్వామి మాట్లాడుతూ.. తమ ఆశ్రమాలలో ప్రధానంగా యజ్ఞయాగాది క్రతువులన్నీ రమాకాంతాచార్యులు చేశారన్నారు. 2000 సంవత్సరం కృష్ణా వసంతోత్సవాలకు వారే ప్రధాన యజ్ఞాచార్యులుగా ఉన్నారని గుర్తుచేశారు. రమాకాంతాచార్యులు శతాధిక దేవాలయాల ప్రతిష్ఠలు చేశారని పలువురు కొనియాడారు. స్నేహపురి గోదా సమేత పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి రమాకాంతాచార్యులు స్థానాచార్యులుగా వ్యవహరించారని అన్నారు. కార్యక్రమంలో అహోబిల రామానుజ జీయర్, అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజ జీయర్, రామచంద్ర రామానుజ జీయర్ స్వాములు, వేదపండితులు పాల్గొన్నారు.


నాగరాజుకు పురస్కారం అందజేస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి

ఏబీఎన్-ఆంధ్రజ్యోతి కార్యక్రమానికి

ఆరాధన టీవీ ప్రతిభా పురస్కారం

చిక్కడపల్లి, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యూస్‌చానల్ ఏబీఎన్-ఆంధ్రజ్యోతిలో ప్రసారమయ్యే ప్రత్యేక కార్యక్రమానికి ఆరాధన 30వ టీవీ ప్రతిభా పురస్కారం లభించింది. బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేషశయనారెడ్డి ఏబీఎన్-ఆంధ్రజ్యోతిలో ప్రసారమవుతున్న వ్యవసాయం ఎట్ ఆర్గానిక్ కార్యక్రమ రచయిత, నిర్మాత నాగరాజును సన్మానించి పురస్కారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీవీలలో ప్రసారమవుతున్న కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో దర్శకుడు రేలంగి నరసింహారావు, లంక లక్ష్మీనారాయణ, చిల్లా రాజశేఖరరెడ్డి, హనుమంతరావు, నిర్వాహకులు లోకం కృష్ణయ్య, నిర్మలా ప్రభాకర్, రేణుకా ప్రభాకర్, ఉమర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల పాలనలో లిడ్‌క్యాప్‌ను పట్టించుకోని బీఆర్‌ఎస్

కవాడిగూడ, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో లిడ్‌క్యాప్‌ను పూర్తిగా విస్మరించారని, నిధులను దారిమళ్లించారని మాదిగ చర్మకారుల సంఘాల జేఏసీ నేతలు ఆరోపించారు. బుధవారం ఇందిరాపార్కులో జేఏసీ కన్వీనర్ కూసపాటి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఆరేపల్లి రాజేందర్ మాట్లాడుతూ.. లిడ్‌క్యాప్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, పాలకమండలిని నియమించి రూ. 10 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న 12 మినీ లెదర్ పార్కులకు బడ్జెట్ కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించిన రెండు మేగా లెదర్ పార్కులను నిర్మించాలన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ కోర్సులను ప్రవేశపెట్టి, రాష్ట్ర ప్రభుత్వమే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల్లోని లెదర్ పార్కుల భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ రవీందర్, నేమరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజాడీలక్స్ చౌరస్తాలో

రోడ్డుపై మురుగు, వర్షపు నీరు

ముషీరాబాద్‌లో రాజాడీలక్స్ చౌరస్తా వద్ద వర్షం నీరు, మురుగు నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం వర్షం కురవడంతోపాటు డ్రైనేజీ నీరు చౌరస్తాలో నిలిచిపోయింది.

- ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి




సమావేశంలో పాల్గొన్న మహేందర్, దశరథం తదితరులు

స్థానిక సంస్థల్లో..

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

రాంనగర్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ డిమాండ్ చేశారు. బుధవారం చిక్కడపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం బీసీలకు ప్రస్తుతం ఉన్న 22 శాతం రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచాలన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక కో-ఆర్డినేటర్ దశరథం, ఉపాధ్యక్షులు నిఖిల్, ప్రచార కార్యదర్శి అఖిల్, నగర కన్వీనర్ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్‌లో 'బ్రెయిలీ' పాఠ్యపుస్తకాలు

ఓల్డ్‌మలక్‌పేట సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): అంధ విద్యార్థుల పాఠ్యపుస్తకాల ముద్రణ ఆంగ్ల మాధ్యంలోనూ చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అంధ విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టాలనే ఉద్దేశంతో మొట్టమొదటిసారిగా ఇంగ్లిష్‌లో బ్రెయిలీ లిపి పాఠ్య పుస్తకాల ముద్రణ చేపట్టారు. ఓల్డ్‌మలక్‌పేటలోని దివ్యాంగుల కార్పొరేషన్ కార్యాలయంలోగల బ్రెయిలీ ప్రింటింగ్ ప్రెస్‌లో పాఠ్యపుస్తకాల ముద్రణ కొనసాగింది. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ముద్రించిన పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. త్వరలో వీటిని విద్యార్థులకు అందించనున్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇండెంట్‌తోపాటు విద్యార్థుల యూడీ ఐడీ కార్డులు జతచేసి పాఠ్యపుస్తకాలను తీసుకెళ్లాలని ప్రింటింగ్ ప్రెస్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. రాష్ట్రంలో మహబూబ్‌నగర్, కరీంనగర్, హైదరాబాద్‌లో మూడుచోట్ల, అదిలాబాద్, వరంగల్, నల్లగొండ జిల్లాల్లో అంధ పాఠశాలలు కొనసాగుతున్నాయి.


పంపిణీకి సిద్ధంగా ఉన్న పుస్తకాలు

గుర్తింపు పొందిన నటుడు జెన్నీ

చిక్కడపల్లి, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): సినీ రంగంలో వివిధ విభిన్న పాత్రల్లో నటించి గుర్తింపు పొందిన నటుడు జెన్నీ అని వక్తలు అన్నారు. రాగరాగిణి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయగాన సభలో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుగ్రహీత డా. అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా సినీ, టీవీ, రేడియో, మైమ్, నటుడు జెన్నీ(పోలాప్రగడ జనార్దనరావు)ని సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దక్షిణ మధ్య రైల్వే పూర్వ జీఎం సి. రామకృష్ణ మాట్లాడుతూ.. జెన్నీ సుమారు నాలుగు వందల సినిమాల్లో నటించి ప్రేక్షకుల అభిమానం చూరగొన్నారని ప్రశంసించారు. మాజీ రాష్ట్రపతి జ్ఞానీజైల్‌సింగ్ ఎదుట మైమ్ ప్రదర్శన ఇచ్చిన జెన్నీ తెలుగువాడు కావడం అందరికీ గర్వకారణమన్నారు. సమావేశంలో తెలుగు భాషా ప్రచారకర్త వి. శైలజ, రాగరాగిణి అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రమణకుమారి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు అక్కినేని నటించిన సినిమాల్లోని పాటలను గాయకులు మధురంగా ఆలపించారు.

రైలులో ప్రయాణికురాలి బ్యాగు చోరీ

బర్కత్‌పుర, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణికురాలి బ్యాగ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర జల్‌గాన్‌కు చెందిన రేఖ ప్రభాకర్ వైదేకర్ (68) ఓకా - మధురై ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి వస్తున్నారు. పూర్ణ జంక్షన్ వద్ద ఆమె బ్యాగు కనిపించలేదు. అందులో సెల్‌ఫోన్, రూ. 8 వేలు, ఆధార్, డెబిట్ కార్డులు ఉన్నాయి. బుధవారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

17 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ. 70,470 స్వాధీనం

రాంనగర్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న 17 మందిని సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్, ముషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ముషీరాబాద్ సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. బోలక్‌పూర్ ఇందిరానగర్‌లోగల సహారా ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రాత్రి ఆసిఫ్ అనే వ్యక్తి శుభకార్యం నిర్వహించాడు. కార్యక్రమానికి హాజరైన అతడి స్నేహితులు 17 మంది పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ. 70,470 స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ప్రేమ్ కుమార్ తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి.. ముగ్గురి అరెస్ట్

బర్కత్‌పుర, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): వ్యభిచారం గృహంపై పోలీసులు దాడిచేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసులు కొంతకాలంగా కుత్బిగూడలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్నాడు. రఫీక్ ఉల్‌మల్లా అతడికి అమ్మాయిలను పంపిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై దాడిచేశారు. విటుడు సంతోష్‌మిత్రా, శ్రీనివాసులు, రఫీక్ ఉల్‌మల్లాను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 6,700, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యప్ప భక్తురాలి మృతి

ముషీరాబాద్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప పరమ భక్తురాలు అహల్య(81) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ మంత్రి టి. పద్మారావు గౌడ్, కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుషాల్‌గౌడ్ ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలు ముషీరాబాద్‌లోని శ్మశానవాటికలో నిర్వహించారు.


అహల్య (ఫైల్)

ముషీరాబాద్ సర్కిల్‌లో..

దోమల నివారణ చర్యలు నామమాత్రమే

- బస్తీల్లో ఫాగింగ్ చేయని వైనం
- విష జ్వరాల బారిన పడుతున్న ప్రజలు
- ఎంటమాలజీ సిబ్బంది రెండు గంటలే పనిచేస్తున్నారని విమర్శలు



రాంనగర్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో ఆరు డివిజన్లలో దోమల నివారణ చర్యలు నామమాత్రంగా చేపడుతున్నారు. దోమకాటుతో మలేరియా, డెంగీ వంటి విషజ్వరాల బారిన పడిన వారు ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ ఇటీవల రాంనగర్ డివిజన్‌లో పర్యటించి పేరుకుపోయిన చెత్త, మట్టికుప్పలను చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ సర్కిల్ పరిధిలోని ఎంటమాలజీ విభాగం పనితీరు మార్చుకోలేదనే విమర్శలు వస్తున్నాయి. రాంనగర్, అడిక్‌మెట్, విద్యానగర్, ముషీరాబాద్, భోలక్‌పూర్, కవాడిగూడ, గాంధీనగర్‌లో దోమల నివారణకు చర్యలు తీసుకోవడం లేదు. సిబ్బంది నామమాత్రంగా విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సర్కిల్ పరిధిలో యాంటీ లార్వా ఆపరేషన్(ఏఎల్‌వో) టీమ్‌లు నాలుగు పనిచేస్తున్నాయి. ఒక్కో టీమ్‌లో సూపర్‌వైజర్, 18 మంది సిబ్బంది ఉన్నారు. వీరు ప్రతి ఇంటికి నెలలో 15 రోజులకు ఒకసారి వెళ్లి దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా క్రిమిసంహారక మందులు చల్లడం లేదనే విమర్శలు వస్తున్నాయి. సిబ్బంది ప్రతీరోజూ ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకు పనిచేయాల్సి ఉండగా.. రెండు, మూడు గంటలు మాత్రమే పనిచేసి సొంత పనులు చేసుకుంటున్నారని పలువురు అంటున్నారు.

దోమల నివారణకు బస్తీల్లో ఫాగింగ్ చేయకపోవడంతో దోమకాటుతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్రతిరోజూ ఫాగింగ్ చేసేందుకు 10 లీటర్ల డీజిల్, రెండు లీటర్ల పెట్రోల్ వినియోగిస్తున్నట్లు రికార్డుల్లో చూపించి సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ముషీరాబాద్ సర్కిల్‌లో దోమల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.